క్లుప్తంగా

శక్తీశ్వరాలయానికి రూ.2.50 లక్షల విరాళం



విరాళం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న దాత నరసింహరాజు

ద్వారకాతిరుమల: దక్షిణ కాశీగా విరాజిల్లుతోన్న భీమవరం మండలం యనమదుర్రులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శక్తీశ్వర స్వామివారి ఆలయానికి, మండలంలోని రామసింగవరం పంచాయతీ, కొత్తగూడెంకు చెందిన పెన్మెత్స నరసింహరాజు, రాజరాజేశ్వరి దంపతులు రూ.2.50 లక్షలను విరాళంగా సోమవారం అందజేశారు. ఈ విరాళాన్ని నరసింహరాజు తన తల్లిదండ్రులు శక్తీశ్వరరాజు, వరలక్ష్మి పేరున ఆలయ అభివృద్ధి నిమిత్తం దేవస్థానం కమిటీకి అందించినట్లు చెప్పారు. అనంతరం నరసింహరాజు కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత శివన్నారాయణకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 2,01,116 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన పి.రామ శ్యామల వెంకట శివన్నారాయణ రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమ చేయగా, దాతకు దేవస్థానం సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే విజయవాడకు చెందిన మరో భక్తుడు అప్పరాజు వేంకట శేషు కామేష్ రూ.లక్ష ఆలయ కార్యాలయంలో జమచేయగా, ఆయనకు దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధి ఎస్‌బీజీ శేఖర్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్‌కు అవార్డు లభించినట్లు జోనల్ చైర్మన్ ఎస్‌బీజీ శేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 24వ తేదీ విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్లో 32వ ఇంటర్నేషనల్ వాకర్స్ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలను రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్వహించిందని, దీనిని గుర్తించి ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ రవీంద్ర అవార్డును ప్రదానం చేశారన్నారన్నారు. ఘంటసాల గణపతి, గెడ్డం రాంబాబు, ఎల్.మోహన్, మాదేటి సత్యనారాయణ, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సరిపల్లి సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: హనుమజ్జయంతి వ్రత ఉత్సవాలలో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. సరిపల్లి సమీపంలోని స్వయంభు శ్రీ సంజీవ ఆంజనేయ స్వామి ఆలయ వద్ద అష్టోత్తర పూజ, హనుమాన్ హోమం అర్చకులు కొన్న గణపతి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం ఏకాదశ అభిషేకం, లక్ష తమలపాకుల పూజ నిర్వహించనున్నారు. ఆరిపాటి, బయ్యనగూడెం, కొయ్యలగూడెం, గవరవరం, కన్నాపురం ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెదపాడు ఎంపీడీవోగా సబ్బితి నర్సింహమూర్తి

పెదపాడు: పెదపాడు ఎంపీడీవోగా సబ్బితి నర్సింహమూర్తిని నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. పెదపాడు మండలంలోని విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న సబ్బితి నర్సింహమూర్తికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పంచాయతీ విస్తరణాధికారి సాధనాల సూర్యకుమార్ విధులు నిర్వర్తించారు. ఆయన నుంచి నర్సింహమూర్తి సోమవారం ఉదయం బాధ్యతలు తీసుకోనున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చింతలపూడి: బోయగూడెం ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మాథ్యూ కామా ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: కొత్తూరు రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సంఘ విశ్వాసులు



ద్వారకాతిరుమల: దొరసానిపాడులో పల్లకీ సేవలో బాల ఏసుతో ప్రత్యేక అలంకారాల్లో మరియమ్మ

ద్వారకాతిరుమల: మరియ తనయుడు బాల ఏసును పల్లకిలో ఉంచి మహిళలే స్వయంగా మోస్తూ క్రిస్మస్ సంబరాలను గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడా లేని విధంగా క్రిస్మస్ పండుగ రోజున మహిళలు ఇలా పల్లకి వాహనాన్ని మోస్తూ ప్రభువుకు సేవ చేయడం ప్రత్యేకతను చాటింది. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో సోమవారం సాయంత్రం ఈ ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. ప్రతి ఇంటి ముంగిట భక్తులు ఏసుకు అరటి పండ్లు, బియ్యం అందించారు. అలాగే మరి కొందరు పల్లకిని మోస్తున్న మహిళల కాళ్లపై బిందెలతో నీళ్ల పోశారు. ఈ సందర్భంగా క్రీస్తు గొప్పతనాన్ని వివరిస్తూ క్రైస్తవులు ఈ ఊరేగింపును నిర్వహించారు. ప్రతి ఏటా ఈ వేడుకను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. సంతానం లేని మహిళలు సంతానం కోసం, పెళ్లికాని యువతులు పెళ్లికావాలని పల్లకిని మోస్తే కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున మహిళలు, యువతులు ఈ పల్లకిని మోసేందుకు ఆసక్తి చూపారు. ఫాదర్ కాకి చార్లెస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

భక్తి, శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

చింతలపూడి: చింతలపూడి మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాల్లో ఏసు క్రీస్తు జయంతిని సోమవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం రాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవ దేవాలయాల్లో ఉదయం నుంచే పండుగ వాతావరణం కనిపించింది. క్రైస్తవులు క్రైస్తవ దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక బోయగూడెం ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ మాథ్యూ కామా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని పలువురు అన్నారు.

కామవరపుకోట: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తూరులో కర్మేల్ మినిస్ట్రీ పాస్టర్ దిరిసిన మోజేష్ ఆధ్వర్యంలో, సీఎస్ఐ పాస్టర్లు మానుకొండ దేవ స్తుతుడు, జాన్ రాజ్ ఆధ్వర్యంలో, స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ ఫాదర్ పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా క్రీస్తు పుట్టుక గురించి పాస్టర్లు వివరించారు. సహనం, శాంతి, సమాధానం కలిగి ఉండటమే క్రీస్తును మార్గమని, ప్రతి ఒక్కరు క్రీస్తును మార్గాన్ని అనుసరించి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ విశ్వాసులు, పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆర్థిక సహాయం



విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: నిరుపేద విద్యార్థికి పొంగుటూరు పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గ ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తుండగా తండ్రి కోల్పోవడంతో తల్లితో సహా దుర్గ పలు ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పసుపులేటి రాంబాబు, ఆర్ఎంపీ సతీష్‌ని సంప్రదించడంతో ఆయన నేతృత్వంలో దుర్గ తల్లి పోచమ్మకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దుర్గ చదువుకు తామంతా సహకరిస్తామని వారు పేర్కొన్నారు. పి.అరవింద్, గేలం శ్రీను, కె.సత్తిబాబు, ఎంపీటీసీ నేలపోలు దుర్గారావు, డి.మధు, కె.గోపి, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

జంగారెడ్డిగూడెం రూరల్: భారత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మండలంలోని పుట్లగట్లగూడెంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పారేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధానిగా వాజ్‌పేయి పనిచేసిన కాలంలో దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అర్జుల మురళీకృష్ణ, కొల్లూరు సతీష్, కలకండ మోహన్ పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారిగా అక్బర్



వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ పాలకవర్గంలో చోటు సాధించిన సభ్యులు

ఏలూరు రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎస్ఎం అక్బర్ ఎన్నికయ్యారు. శనివారం విశాఖపట్టణంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న సభ్యులు అక్బర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1,500 క్లబ్‌లు, 2 లక్షల మంది సభ్యులు గల వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కార్యక్రమాల్లో అక్బర్ కొంతకాలంగా చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే క్రమంలో ఏలూరుకు చెందిన వి.మురళీమోహన్ అధ్యక్షునిగా, ఎం.ప్రదీప్ కార్యదర్శిగా ఎన్నికై సభ్యుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులైన వీరు ముగ్గురు వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ పాలకవర్గంలో చోటు సాధించడంపై పలు సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ సమాజమే 'మానవత' లక్ష్యం



భీమడోలులో దాతలు బహూకరించిన ఫ్రీజర్ బాక్స్‌ను ప్రారంభించిన అప్పక రాంబాబు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవన గృహ ప్రవేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతన భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు.దాతలు గుల్ల అప్పలస్వామి, అచ్చాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె ఆదిలక్ష్మి, మనవడు కృష్ణ చైతన్యల ఆర్థిక సాయంతో బహూకరించిన ఫ్రీజర్ బాక్స్‌ను జిల్లా శాంతి రథాల కమిటీ చైర్మన్ అప్పక రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి దాతలు అందించిన దాతృత్వం మరవలేనిదన్నారు. భీమడోలులో తీవ్రంగా గాయపడి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న భవన కార్మికుడు యాదగిరి శ్రీనివాస్‌కు మానవత సంస్థ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల చైర్మన్ గుల్ల సూరరాజు, కోశాధికారి గుల్ల అప్పారావు, పెద్దలు తుమ్మల ఉమామహేశ్వరరావు, పి.సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వరాహావతారంలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు జరిగాయి. స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా, ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వక్తృత్వ పోటీల్లో సుమాంజలి ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో నగరంలోని శ్రీ శర్వాణి పాఠశాల విద్యార్థిని బి.సుమాంజలి ప్రథమ స్థానం సాధించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 24వ తేదీన ఈ - కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ అనే అంశంపై ఇంగ్లీష్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో సుమాంజలి ప్రథమ బహుమతి పొందినట్లు పాఠశాల హెచ్ఎం సీహెచ్ సత్య శారద తెలిపారు. విద్యార్థినికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మల్లాది విష్ణు, విజయ సునీత రూ.3,500 నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేశారని చెప్పారు.

మద్ది క్షేత్రానికి స్వాముల పాదయాత్ర



మద్ది క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న ఆంజనేయస్వామి మాలాధారణ స్వాములు

టి.నరసాపురం: ఆంజనేయ మలాధారణ స్వాములు మద్ది క్షేత్రానికి కాలినడకన వెళ్లారు. ఆంజనేయ మాల ధరించి 41 రోజుల పాటు దీక్ష చేసిన స్వాములు సోమవారం దీక్ష విరమణ నిమిత్తం హనుమాన్ నామస్మరణతో పాదయాత్రగా గుర్వాయిగూడెం మద్ది క్షేత్రానికి వెళ్లారు. దీక్షాధారణ స్వాములు మాట్లాడుతూ సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని స్వామి వారి క్షేత్రానికి వెళ్లి ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించనున్నట్లు చెప్పారు. మొత్తం 50 మంది స్వాములు పాదయాత్రగా వెళుతున్నట్లు తెలిపారు. తొలుత ఆంజనేయస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ఇరుముడులు శిరసున ధరించి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టి.నరసాపురం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు స్వామి, మండం ఆదిత్య కుమార్, కొరివి ధర్మరాజు, బంద్రెడ్డి శేఖర్, పోసి బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు సాగాలి



ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జంగారెడ్డిగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జంగారెడ్డిగూడెం పేరంపేట శివాలయం వద్ద పరిషత్ గౌరవాధ్యక్షుడు ఎంఎస్.రామారావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ బ్రాహ్మణుల అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని గుర్తిస్తూ, అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ, సీట్లను కేటాయించి బ్రాహ్మణ జాతి ఉద్ధరణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కూచిబట్ల రాము, నిడుమోలు చిరంజీవిరావు, లంకా నాగకుమార్, సమయమంత్రి రాధాకృష్ణ, కూచి త్రినాథరావు, గన్నవరపు మాధవరావు, మదనంబెడు కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యంగా కృషి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు

పెదవేగి : గ్రామాల్లో పర్యటించి ప్రజల అవసరాలు తెలుసుకుని వాటిని పరిష్కరించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడం తనకెంతో ఆనందాన్ని కలుగజేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం పెదవేగి మండలం జగన్నాథపురంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కల్లెపల్లివారిగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, జగన్నాథపురం సచివాలయ పరిధిలో రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, విజయరాయి సొసైటీ చైర్మన్ పాలదుగు పెదబాబు, సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, స్థానిక నాయకులు మానుకొండ చంద్రరావు, కొలికిపాముల రాంబాబు, ఆడమిల్లి ఏసుపాదం, సాంగ సత్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

భీమడోలు: వైఎస్సార్ సీపీ మండల యూత్ విభాగం మండల అధ్యక్షుడిగా మద్దుల రాజా నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి మండల యూత్ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వాసుబాబును రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని, మండల క్యాడర్‌తో సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని సోమవారం రాజా తెలిపారు. భీమడోలుకు చెందిన మద్దుల రాజా ప్రస్తుతం మండల సచివాలయాల కన్వీనర్‌గా పని చేస్తున్నారు. గతంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా, 2019 ఎన్నికల సమయంలో మండల బూత్ మేనేజర్‌గా పని చేసారు. మండలంలోని గ్రామాల్లో యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తామని ఆయన తెలిపారు.

వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



దేవతా విగ్రహాల ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: గంగన్నగూడెంలో సోమవారం అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి నవగ్రహ సతీసమేత విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున నుంచి కాశీ విశ్వేశ్వర ఆలయంలో నవగ్రహ సతీమేత నాగమానసా దేవి, నాగబంధం, కాలభైరవ విగ్రహాలను వేద పండితు మంత్రోచ్ఛరణ మధ్య సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పలపాటి మాణిక్యాలరావు, వైస్ చైర్మన్ మొటపర్తి గాంధీ, సెక్రటరీ శాఖమూడి సీతారామాంజనేయులు, సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, కోశాధికారి కూచిపూడి వెంకట కిషోర్ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వేర్వేరుగా పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ ఉప్పలపాటి మాణిక్యాలరావు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని స్వాగతం పలికారు. గంగన్నగూడెం సొసైటీ చైర్మన్ బోయపాటి గాంధీ, బోయపాటి గణేష్, నాదెండ్ల నారాయణ ప్రసాద్, గన్నమనేని రాజా, భక్తులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా మసీదుపాడులో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మోత్రపు జేమ్స్ రాజుకు సోమవారం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడికి చికిత్స నిమిత్తం తమ వంతుసాయం అందించామని చేయూత సంస్థ సభ్యులు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి

చింతలపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. చింతలపూడిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రభుత్వ పరిపాలన పేదల ముంగిటకు తీసుకువచ్చారని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో పెను మార్పులు తీసుకువచ్చి కార్పొరేట్ వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారని కొనియాడారు. మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ముగిసిన కుట్టు శిక్షణ శిబిరం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ పరిధిలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సౌజన్యంతో రెండు నెలల పాటు మహిళలకు కుట్టు శిక్షణ నిర్వహించారు. రోజుకి తొంభై మంది వరకు శిక్షణ తీసుకున్నట్లు కోఆర్డినేటర్ ఆరేటి ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా శిబిర నిర్వహణకు సహకరించిన ముసిరెడ్డి కావ్య నాగశ్రీ, మల్లబత్తుల గంగరాజు, కోన రామకృష్ణ, బొచ్చు బాబు రావు, నెక్కంటి సూర్య కుమార్‌లను సన్మానించారు. కుద్రు వెంకట నాగేశ్వరావు, మల్లబత్తుల రాము, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మంగళవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ ఉదయం 9 గంటలకు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల ఎంబీ సోషల్ షెటిల్ స్టేడియంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిరుపేద పిల్లలకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందించిన ట్రస్ట్ సభ్యులు

ఏలూరు రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని నిరుపేదలు సైతం సంతోషంగా జరుపుకోవాలని రివల్ చారిటబుల్ ట్రస్ట్ కాటూరి సుధాకర్ ఆకాంక్షించారు. మంగళవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యాన స్థానిక యానాదుల కాలనీలో నిరుపేద పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యాన కొంతకాలంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దానిలో భాగంగా నిరుపేద పిల్లలు విద్యవంతులు కావాలని పుస్తకాలు, బ్యాగ్‌లు అందిస్తున్నామన్నారు. పండుగ వేళల్లో పౌష్టికాహారం, దుస్తులు ఇస్తున్నామన్నారు. ఇదే క్రమంలో మహిళలకు సైతం నిత్యావసర సరుకులు అందిస్తున్నామని గుర్తు చేశారు.

'ఆడుదాం ఆంధ్ర'కు 880 జట్ల ఎంపిక

గణపవరం: గణపవరం మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనడానికి 4,200 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. వీరితో 880 జట్లు ఏర్పాటు చేశామన్నారు. వీరికి ఈనెల 26వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జెడ్పీ హైస్కూల్లో సచివాలయం పరిధిలో నమోదు చేసుకున్న జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ స్థాయిలో పురుష, స్త్రీ జట్లకు వేర్వేరుగా ఐదురకాల విభాగాల్లో క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జట్లమధ్య పోటీలు నిర్వహిస్తామన్నారు.

మూడు తాటాకిళ్లు దగ్ధం

ఉంగుటూరు: ఉంగుటూరు దళిత పేటలో మూడు ఇళ్లు, గడ్డివాము దగ్ధమైంది. సోమవారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. ఇర్లపాటి రాజు, కారిమి సుబ్బమ్మ, బళ్లమూడి శశిరేఖకు చెందిన తాటాకుల ఇళ్లు, బళ్లమూడి శ్రీనుకు చెందిన గడ్డివాము దగ్ధమయ్యాయి. తాడేపల్లిగూడెం ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.